# ఓ అందమైన అమ్మాయి కథ

## అమావాస్య -
## అర్ధరాత్రి -

వెలుపల గాఢాంధకారంగా ఏకటి జడలు విరబోసుకున్న దయ్యంలా వుంది.

కన్ను పొడుచుకున్నా కనిపించటం లేదు.

ఊరికి దూరంగా, పొలిమేరల్లో, దట్టంగా వున్న మామిడితోపుల పరిసరాల్లొవున్న పాత బంగళాలో విడిది చేసిన ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖరానికి నిదుర పట్టలేదు. ఆ వూరికి ఏ అధికారి వచ్చినా బస అక్కడే ఏర్పాటు చేస్తారు. ఒక మర్డర్ కేస్ ఎంక్వయిరీ విషయమై ఆ వూరు వచ్చారు. పోలీస్ సబ్-ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్.

ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ యువకుడు అవివాహితుడు దృఢమైన, దీర్ఘమైన అజానుబాహుడు అతనికి నిద్ర పట్టటంలేదు. కేసుకు సంబంధించిన ఫైలును ఒకటికి నాలుగుమార్లు చదువుతున్నాడు. సిగరెట్టుమీద సిగరెట్టు కాలుస్తూ, ఆలోచిస్తున్నాడు

"వాచ్‌మాన్" పిలిచాడు చంద్రశేఖర్. నిశీథిని ధిక్కరించినట్లుందా పిలుపు. నిశ్శబ్దానికి ప్రత్యర్థి అయిందా అరుపు.

"..................."

"వాచ్‌మాన్" కంఠస్థాయి హెచ్చించింది మరలా పిలిచాడు.

"అయ్యా!" వచ్చి. వాకిట్లో నిలుచున్నాడు నిద్రకళ్ళను నులుముకుంటూ.

"నీ పేరేమిటి?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్.

"నా పేరా బాబూ! చెంగయ్య"

"చూడు చంగయ్యా? కానిస్టేబుల్స్ నిద్రపొయ్యారు కదూ?" ఏదో ఒకటి మాటాడాలన్నట్లు నిశ్శబ్దాన్ని భంగపరిచాడు చంద్రశేఖర్.

'అవునయ్యా!' ఇంకా కళ్ళు నులుముకుంటూనే వున్నాడు చంగయ్య.

'మంచినీళ్ళు కావాలి' కాలిపోయిన సిగరెటు అవతలికి విసిరేస్తూ అన్నాడు చంద్రశేఖర్

"కూజాలో సాయంకాలమే పోసి వుంచాను బాబూ?" అంటూ కూజా లోని నీళ్ళు గ్లాసులోకి పోసి, అందించాడు చంగయ్య.

"ఇంకా తలుపులు కూడా వేసుకోలేదేం బాబయ్యా? నిద్ర రావటం లేదా?" అప్పటికి నిద్రమత్తు వదిలించుకొని అడిగాడు చెంగయ్య

చంద్రశేఖర్ సమాధానం చెప్పలేదు. మౌనంగా నీళ్ళు త్రాగి గ్లాసు అందించాడు. గ్లాసును యథాస్థానంలో వుంచి, వెళ్ళి గుమ్మంలో నిలుచున్నాడు చంగయ్య.

"వర్షం వచ్చేలా వుందికదూ? ఇక నువ్వెళ్ళి పడుకో" అన్నాడు చంద్రశేఖర్.

చ గయ్య ఏదో చెప్పబోయాడు. అప్పటికే బెడ్‌ను చేరుతున్న చంద్రశేఖర్ వెంట తెచ్చుకున్న "జేమ్స్‌బాండ్" నవలలో మునిగిపోయాడు ఇన్‌స్పెక్టరుకు అంతరాయం కలిగించటం ఇష్టంలేక, మెల్లగా వెళ్ళి, తన పడకపై వాలిపోయి నిద్రాదేవి ఒడిలో సోలిపొయ్యాడు చెంగయ్య.

గాలి విపరీతంగా వీయటం మొదలు పెట్టింది. కిటికీలు దబదబా కొట్టుకోవటం మొదలు పెట్టాయి. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖరానికి 'డిస్టర్బ్' అయింది.

కోపంగా "చెంగయ్యా!" అని పిలిచాడు చెంగయ్య దగ్గర్నుంచి "రెస్పాన్సు" లేదు.

"దద్దమ్మలు తినటం, నిద్రబోవటం తెలుసు" పుస్తకాన్ని మడిచి అక్కడ పుంచి, లేచి కిటికీ వద్దకు వెళ్ళాడు.

"తళుక్కు"మని మెరిసింది.

ఆ మెరుపు వెలుగులో దూరాన ఒక ఆకారం.... కాదు.... కాదు.... ధవళ వస్త్రధారియైన ఓ స్త్రీ మూర్తి కనిపించింది. కళ్ళు నులుముకొని, మరలా చూశాడు ఇనస్పెక్టర్. కానీ, ఏమీ కనించలేదు. అంతా చీకటిమయం.

"భ్రమ" అనుకుంటూ కిటికీ రెక్కలు, రూమ్ తలుపులు మూసి వచ్చి, మరలా పుస్తకంలో లీనమయ్యాడు

"........దీపాలన్నీ ఒక్కసారిగా ఆరి పొయ్యాయి చీకటి భయంలా వుంది. భీకరంగావున్న ఆ సమయంలో ఎవరినో స్త్రీ పాదాలు నడచిన సవ్వడి వినవస్తూవుంది. వెంబడించే మరోవ్యక్తి అడుగులు కర్కశంగా వినవస్తున్నయ్. స్త్రీ అడుగుల చప్పుడు ఆగిపోయింది ఓ క్షణం నిశ్చబ్దం. తరువాత కత్తి తీసిన శబ్దం. "కెవ్వు"మన్న బావుకేకతో స్త్రీ క్రింద "దబ్" మని పడిపోయిన ధ్వని........'— జేమ్సుబాండ్ నవల చదువుతున్న ఇన స్పెక్టర్ చంద్రశేఖరానికి "చుర్"మని కాలింది వ్రేళ్ళకు, కాలిపోయిన సిగరెట్టు ముక్క, విసుగ్గా ఆ ముక్కను దూరంగా విసిరాడు, ఓ మూలగా.

నవల ప్రక్కనపెట్టి, ఆవులించాడు.

ఉన్నట్టుండి ఆకాశం పెళపెళార్భాటం చేసింది. ధారాపాతంగా వర్షించసాగింది. అనుకోకుండా వాతావరణం అతి భీభత్సమయింది. ఇన స్పెక్టర్ చంద్రశేఖరానికి చిన్ననాటినుండి కురుస్తున్న వర్షాన్ని చూస్తూ గడపటం అన్నా. ఆ సవ్వడిని వింటూ నిదురించాలన్నా చాలా ఇష్టం, ఆ ఆకాశం ఇలా లభించేటప్పటికి ఆనందించాడు.

ఓ మారు కిటికీ దగ్గరకెళ్ళి తలుపులు తీశాడు వర్షపు జల్లు లోనికొచ్చింది. ముఖాన్ని తడిపింది గబుక్కున తలుపులు మూశాడు. టవలుతో ముఖాన్ని, ఛాతీని తుడుచుకుంటూ, బెడ్‌పై వెల్లకిలా పడుకొని, మెడవరకు దుప్పటి కప్పుకొని, మధురమైన ఆలోచనలో మునిగిపొయ్యాడు. బ్రహ్మవారి కాలం యిలా గడుస్తుందేమో!

బయట వర్షం కురుస్తూనే వుంది.

వెలుపల ఎవరో తలుపు తడుతున్న శబ్దం వినిపించింది. తియ్యటి ఊహలలోవున్న చంద్రశేఖరానికి, కాలేజీలో తన క్లాస్‌మేట్ అందమైన రేఖను గూర్చి, ఆమె కళ్ళను గూర్చి ఆలోచిస్తున్న చంద్రశేఖరానికి బయట తలుపు తడుతున్న శబ్దం ఎక్కువ కావడంతో కోపం వచ్చింది.

"ఎవరూ? వెంగయ్యా!" కాస్త తీవ్రత కనిపించిందా కేకలో.

జవాబు లేదు.

ఎక్కడో పిడుగుపడిన శబ్దం!.....

ఎక్కువయిన వర్షపు జోరు....

మరలా తలుపు తట్టిన శబ్దం....

దబదబా తడుతున్నారెవరో!

ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ లేచాడు. పిస్టల్ చేతికి తీసుకున్నాడు. వెళ్ళి, తలుపులు తీశాడు, ఆశ్చర్యపోయాడు.

ఇంతకు మునుపు కిటికీలోంచి దూరాన చూచిన స్త్రీ మూర్తి? ఆమె!! ఆమెనే తను చూశాడు!!!— వర్షంలో పూర్తిగా తడిసి, చలికి వణుకుతూ నిలబడి వుంది తెల్లని, సన్నని చీర తడిసి, శరీరానికి అతుక్కుపోయి వుంది. ఆమెలోని యౌవనాన్ని దాచలేక పోతూవుంది అప్సరసలా వుంది. ఎంతటి నిగ్రహపరుడైనా, ఆ తరుణంలో ఆ యౌవనాంగిని చూస్తే.... ఓహ్....

"లోపలికి రండి." మత్తుగా పిలిచాడు బ్రహ్మచారియైన ఇనస్పెక్టర్ చంద్రశేఖర్.

"క్షమించండి. మిమ్మల్ని డిస్టర్బ్ చేశానేమో?" ఆమె విశాల నేత్రాలు మిలమిల మెరిశాయి. ఆమె చలికి వణికిపోతూ లోపలికి అడుగు పెట్టింది.

ఫర్వాలేదు అయినా అర్ధరాత్రివేళ అందమైన ఆడపిల్ల యిలా ఒంటరిగా?" ఆమెవైపు అనుమానంగా చూస్తూ అన్నాడు చంద్రశేఖర్.

ఆమె నవ్వింది పలు వరుసలో వెన్నెలలు కాశాయి.

బుగ్గలు అరుణిమను దాల్చాయి. ఆమె అవయవాలను దాచు కునేందుకు ముడుచుకొనిపోతూ "చలిగా వుంది. ప్లీజ్" అన్నది సిగ్గుగా.

"సారీ ... పొడిబట్టలు.... మీ కభ్యంతరం లేకపోతే.... నా లుంగీ, టవలూ ఇస్తాను."

"ఇవ్వండి" ప్రాధేయపడుతున్నట్లు అడిగిందామె ఆమె శరీరంలో మెరుపు కొట్టొచ్చినట్లు బహిర్గతం అవుతూవుంది

ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తన పిస్టల్ అక్కడ వుంచి సూట్‌కేస్ తెరచి, లుంగీ, టవలూ యిచ్చాడు.

"మీరటు మళ్ళండి. నేను బట్టలు మార్చుకుంటాను" అన్నదామె మధురంగా.

ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ యిటు తిరిగి ఆమెగూర్చి ఆలోచించసాగాడు.

"ఎవరీమె? ఎందుకిలా అర్ధరాత్రిపూట వర్షంలో తడుస్తూ ఈ బంగళాకొచ్చింది?? అందంగా వుంది చదువు, సంస్కారం ఉన్న అమ్మాయిలా వుంది మరెందుకిలా ....?"—

"కట్టుకున్నాను" అన్న ఆమె పలుకుతో ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ ఆలోచనలు తెగిపోయ్యాయి

అటు తిరిగాడు. ప్రేమ్ కుర్చీ లాక్కొని కూర్చున్నాడు, పాపం! లుంగీ చాలలేదు టవలుతో రొమ్ములు కప్పుకొని వుంది! అదీ చాలటం లేదు. సర్దుకుంటోంది. శరీరం పసిడి ఛాయలను ప్రసరిస్తూంది. దీపపు కాంతిలో ఆమె దేవ కన్యకలా వుంది.

"మీరు చాలా అందంగా వున్నారు'' ఇన్‌స్పెక్టర్ ఆమె అందాన్ని అభినందించకుండా ఉండలేక పొయ్యాడు.

"నిష్ప్రయోజనమైన అందం వుండి కూడా ఏం లాభం'' నిరాశగా అన్నది ఆమె.

"అంటే?"

"ఏం అలా అంటున్నారు?" సిగరెట్ కేస్ తీసుకుంటూ అడిగాడు చంద్రశేఖర్.

''మీకు పెండ్లయిందా?" అడిగిందామె.

"లేదు" సిగరెట్టు ముట్టించుకుంటూ అన్నాడు చంద్రశేఖర్.

"అయితే నన్ను గురించి మీతో చెప్పొచ్చు, చెప్పనా?" నిట్టూర్పు విడుస్తూ అన్నదామె. ఆమె ప్రతి కదలికా ఒక మధుర భంగిమలా వున్నది.

"నేనూ అడగాలి— అనుకుంటూ వున్నాను." సిగరెట్ దమ్ము వదులుతూ అన్నాడు చంద్రశేఖర్. "అలా కూర్చోండి" కుర్చీ చూపించాడు. ''పర్వాలేదు తల ఆర్చుకోవాలి'' ఎర్రటి ఆమె బుగ్గలమీద, మెడ మీద వర్షంలో తడిసి అంటుకుపోయిన వెంట్రుకలను తీస్తూ, జుట్టును ఆర్పుతూ అన్నదామె

నల్లని, పొడుగాటి ఆమె కురులు ఎంతటి శోభ నిస్తున్నాయ్?

"మీ పేరు?" బొత్తిగా పోలీస్ స్టార్టింగ్.

"కాంతి."

"చక్కటి పేరు, పేరుకు తగ్గట్టే వున్నారు మీరు. నా పేరు చంద్రశేఖర్., నేనొక పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ను.'' క్రాపును వ్రేళ్ళతో సవరించుకుంటూ అన్నాడు.

''మీ చేతిలో పిస్టల్ చూడగానే ఊహించాను.''

"మీరు భయపడలేదా?"

"జీవితంలో ఒక్కసారే భయపడతారు ఆ తరువాత భ్రమపడుతారు. నేనూ అంతే!"

ఎందుకో ఆమెను, ఆమె అందాన్ని చూస్తుంటే చంద్రశేఖర్ మనస్సు గతి తప్పుతోంది. ఆమెను అలా అర్ధ నగ్నంగా చూస్తుంటే, అతని వయస్సు ఉరకలు వేస్తూంది మంత్రముగ్దుడివలె చూస్తూ కూర్చున్నాడు ఆమె వైపే తదేకంగా చూడసాగాడు తను ఏం చేస్తున్నదీ తనకే అర్థం కావటం లేదు.

అన్నింటినీ మించిన మత్తు అందంలో ఉంటుందంటారు! అదే కామోసు!

"అలా చూడకండి. సిగ్గేస్తుంది" ఆమె గుండెల మీదికి టవలు బిగుతుగా లాక్కొంటూ అన్నది.

"క్షమించండి. మనస్సు మనస్సులో నిలవటంలేదు" అలా చూస్తూనే, మనసులో అనుకున్నమాట, బయటకనేశాడు.

ఆమె కళ్ళు రేఖ కళ్ళ కన్నా అందంగా వున్నాయ్!

క్షణ క్షణానికి చంద్రశేఖర్ పిచ్చివాడవుతున్నాడు అయినా నిగ్రహించుకోగలుగుతున్నాడు.

"కాంతి! అభ్యంతరం లేకపోతే యిలా వచ్చి మంచం మీద కూర్చోకూడదూ?"

''ముందు నన్ను గూర్చి చెప్పుకోనివ్వండి. ఆ తరువాత మీరు రమ్మంటే అలాగే వచ్చి కూర్చుంటాను." మధురిమ నిండిన పెదవులతో మృధువుగా పలికింది ఆమె.

"అలాగే"

"ఆశ్చర్యపోతారేమో?"

"ముందు చెప్పండి మీ కథ"

"కథ కాదు నా జీవితం."

'అలాగే, చెప్పండి' చంద్రశేఖర్ మరో సిగరెట్టు వెలిగించుకున్నాడు

"మధ్యలో మీరు ఏమీ మాటాడకూడదు. సరేనా?", కళ్ళను త్రిప్పుతూ అంది కాంతి.

"సరే!" కుతూహలంగా తల పంకించాడు చంద్రశేఖర్.

"నేను ఈ బంగళా వాచ్‌మాన్ వెంగయ్య కూతుర్ని. నేనొక్కర్తెనే మా నాన్నకు, అందుకని నన్ను అతి గారాబంగా పెంచారు బాగా చదివించారు కానీ, వయస్సు మీరిన ఒక పల్లెటూరు మొద్దుకు నన్నిచ్చి, మేనమామ ఆచారమని బలవంతంగా పెళ్ళి చేశారు. నా ఖర్మ! పెండ్లి జరిగిననాడే గుండె జబ్బుతో ఆయన చనిపోయారు. నేను విధవనయ్యాను.

"ప్రతిరోజూ రాత్రి నాన్నకు అన్నం తెచ్చేదాన్ని. ఈ రోజు అమ్మకు ఒంట్లో బాగులేక, ఆమెకు సపర్యలు చేస్తూ వున్నాను. చాలా ప్రొద్దుపోయింది. ఆమెను నిద్రపుచ్చి, అన్నం పెట్టుకొని బయలుదేరాను. దారిలో వర్షం పట్టుకుంది గాలీ వానా కలసి నా చేతిలోవున్న ఆ కారియర్ ఎగరకొట్టేశాయి వెతికి వెతికి వేసారాను ఎక్కడా కనిపించలేదు. వర్షం ఎక్కువయింది. ఎక్కడో పిడుగు పడింది పిడుగంటే నాకు చిన్ననాటి నుండి గంపెడు భయం. అందుకే పరుగెత్తుకొని వచ్చి, మీ తలుపు తట్టాను. ఇక ఈ రాత్రికి ఇక్కడే వుండాలి ఇప్పుడు నాన్నను లేపటం నాకిష్టంలేదు. కోప్పడొచ్చు, మీకభ్యంతరం లేకపోతే మీ గదిలోనే వుంటాను...."

కథా నిలయం
3584
శ్రీకాకుళం

దగ్గర్లోనే పెళ పెళార్భాటంతో పిడుగు పడింది.

చెబుతున్న కాంతి అగి మీది టవలును కూడ విడిచి, భయంగా అరుస్తూవచ్చి, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గుండెల కదుముకొని పోయింది. గదిలో దీపం ఆరి పోయింది.

ఆమె ప్రగాఢ పరిష్వంగంలో ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ మైమరిచాడు.

వారిద్దరూ మధురానుభూతులకు లోనయ్యారు. బయట వర్షం కురుస్తూనే వుంది.

ఉదయం....

ఏడుగంటలకుగానీ నిద్ర లేవలేక పోయాడు ఇన్‌స్పెక్టర్ చంద్ర శేఖర్. వళ్ళంతా నొప్పులుగా వుంది.

వర్షం ఆగిపోయి ఉంది.

రాత్రి ఎప్పుడు నిద్రపోయాడో తనకే తెలీదు.

ఆమేది?

కాంతి కనిపించదేం??

వాళ్ళ నాన్నకు భయపడి, ఏ తెల్లవారు ఝామునో జారుకొని వుంటుంది

గదిలో ఇంకా చెమ్మగా వుంది, రాత్రి ఆమె నిలచిన చోట.

తను యిచ్చిన లుంగీ, టవలు క్రింద విడిచిపోయింది.

వళ్ళు విరుచుకుంటూ, రాత్రి జరిగిన మధురానుభూతులను తలచుకుంటూ, నవ్వుతూ లేచాడు చంద్రశేఖర్.

ఎలాగైనా ఆమెను కలుసుకోవాలి?

ఎన్నో ఆలోచనలు కదిలాయి మదిలో.

కాలకృత్యాలు పూర్తి అయ్యాయి.

వెలుపల పోలీసులు రడీ అవుతున్నట్లున్నారు. తనూ డ్రస్ చేసికొని, బెంగయ్యను పిలిచాడు. ఏవో విషయాలు మాట్లాడుతూ మెల్లగా "బెంగయ్యా! నీ కెంతమంది పిల్లలు" క్రాంతి ప్రస్తావన కోసం తంటాలు పడ్డాడు.

చంగయ్య కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

"అదేమిటయ్యా? కళ్ళ నీళ్ల పెట్టుకుంటావ్?" విచిత్రంగా చూస్తూ అడిగాడు చంద్రశేఖర్

"ఏమని చెప్పను బాబూ! ఒక్కగానొక్క కూతురు, కాంతి! బంగారు భరిణ. చదివించాను కూడా. నా మాటన్నా వినకుండా వాళ్ళమ్మ, వయస్సు మీరిన తన తమ్మునికిచ్చి పెండ్లి చేసింది.

అది వద్దన్నా వినిపించుకోలేదు. పాపిష్టివాణ్ణి నేనూ గ్రహించలేక పోయ్యాను నా బిడ్డ మనస్సు. ఇష్టంలేని పెళ్ళి చేశామన్న ఉక్రోషంతో నా బంగారు తల్లి, పెళ్ళి చేసిన రాత్రే బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది బాబూ" పెద్దగా ఏడుస్తూ వెలుపలికి వెళ్ళిపొయ్యాడు వాచ్ మాన్ బెంగయ్య.

"బెం...." అంతే! మాట పెకిలి రాలేదు ఇన్‌స్పెక్టర్ చంద్ర శేఖరానికి?? అలాగే నిలువునా బెడ్ మీద చతికిలపడి పొయ్యాడు.

★